క్లుప్తంగా

రీసర్వేపై వీఆర్వోలు, సర్వేయర్లతో సమీక్ష

పాకాల: భూముల రీసర్వేపై వీఆర్వోలు, సర్వేయర్లతో తహసీల్దార్ భాగ్యలక్ష్మి సోమవారం సమీక్షించారు. మండలంలో రీసర్వే పనులు వేగవంతం చేయాలని, రీసర్వే సమయంలో రైతులు అందుబాటులో ఉండి సమస్యలను తమ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ పరదేశి, మండల సర్వేయర్ గోపీనాథ్ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని సోమవారం ఆస్ట్రాలజిస్ట్ వేణుస్వామి, ఎంపీ కోటగిరి శ్రీధర్ దర్శించుకున్నారు. వారికి అధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

విద్యార్థులకు నగదు బహుమతులు



ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో నారాయణ విద్యాసంస్థ ప్రతినిధులు

తిరుపతి ఎడ్యుకేషన్: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో వందలోపు మూడు ర్యాంకులు సాధించిన నారాయణ విద్యాసంస్థ విద్యార్థులకు ఆ విద్యాసంస్థ భారీ నగదు బహుమతి అందజేసింది. శ్రీనివాసమంగాపురంలోని ఆ విద్యాసంస్థలో సోమవారం విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి 34వ ర్యాంకు సాధించిన బాబు సుజన్‌రెడ్డికి రూ.5 లక్షలు, 71, 90వ ర్యాంకులు సాధించిన మిఖిల్, శశాంక్‌రెడ్డికి చెరో రూ.4 లక్షలు చొప్పున ఎండీ సింధూర, అడకమిక్ హెడ్ ప్రమీల, డీజీఎం కొండలరావు అందజేశారు.

ఫిర్యాదులను పరిష్కరించండి



సమావేశంలో అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ

తిరుపతి తుడా: ప్రజల ఫిర్యాదులను సత్వరం పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్ సునీత సూచించారు. ఆమె సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో స్పందన డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ స్పందన ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ మాట్లాడుతూ నగరంలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రోడ్ల మరమ్మతులు, మాన్ హోల్ ఓవర్ ఫ్లో సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. కార్పొరేటర్ నరసింహాచారి మాట్లాడుతూ తిరుపతి నగరంలో అనధికారికంగా తెలుగు గంగ, యూడీఎస్ కనెక్షన్లు కలిగి ఉన్నారని, స్పెషల్ డ్రైవ్ నిర్వహించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, ఎస్ఈ మోహన్, హెల్త్ ఆఫీసర్ హరికృష్ణ పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోండి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

చంద్రగిరి(తిరుపతి రూరల్): సమస్యలు పరిష్కరించి భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరాములు కోరారు. ఆయన సోమవారం చంద్రగిరి ఆర్ఐ మోహన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడు తూ ప్రమాదవశాత్తు కార్మికులు మరణిస్తే రాష్ట్ర ప్రభుత్వం ఆదుకునేలా పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్ విడుదల చేయాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులు కార్మికుల సంక్షేమానికే ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

13 నుంచి ఆండాళ్ తిరుపవడిపురం ఉత్సవం

తిరుపతి కల్చరల్: గోవిందరాజస్వామి ఆలయంలో 13వ తేదీ నుంచి 22 వరకు ఆండాళ్ అమ్మవారి తిరువడిపురం ఉత్సవం నిర్వహించనున్నారు. ప్రతిరోజూ ఉదయం ఆండాళ్ అమ్మవారికి తిరుమంజనం, సాయంత్రం ఆస్థానం నిర్వహిస్తారు. 22న అమ్మవారి శాత్తుమొర సందర్భంగా ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు గోవిందరాజస్వామి వారు, ఆండాళ్ అమ్మవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం చేస్తారు. అదే రోజు సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు గోవిందరాజస్వామి, ఆండాళ్ అమ్మవారిని అలిపిరికి ఊరేగింపుగా తీసుకెళ్లి అక్కడ ఆస్థానం చేపడతారు. ప్రత్యేక పూజల అనంతరం అలిపిరి నుంచి రామనగర్ క్వార్టర్స్‌లోని గీతామందిరం, ఆర్ఎస్ మాడ వీధిలోని శ్రీవిఖనసాచార్యుల ఆలయం, చిన్నజీయంగార్ మఠం మీదుగా ఊరేగింపుగా తిరిగి ఆలయానికి చేరుకుంటారు.

రాష్ట్రంలో జనరంజక పాలన

- ఇరంగారిపల్లిలో రూ.3.16 కోట్లతో అభివృద్ధి పనులు
- వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి
- గడప గడపకూ మహా పాదయాత్రకు విశేష ఆదరణ



చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

పాకాల: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం పాకాల మండలం ఇరంగారిపల్లి పంచాయతీలో గడప గడపకూ మహాపాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఫకీరుపేట, శ్రీనివాసనగర్, ఇరంగారిపల్లిలో ఇంటింటికీ వెళ్లి ఆప్యాయంగా పలుకరించారు. ఆయనకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. మోహిత్‌రెడ్డి ఫకీరుపేటలోని దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సీఎం జగనన్న పాలనలో చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రజల కోసం అహర్నిశలు చేస్తున్న కృషిని విశదీకరించారు. ప్రజా వినతులను సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను కోరారు. నియోజకవర్గంలో అర్హత కలిగిన ఏ ఒక్కరూ ప్రభుత్వ పథకాలు అందకుండా ఉండకూడదని స్పష్టం చేశారు.

రూ.3.16 కోట్లతో అభివృద్ధి పనులు..

ఇరంగారిపల్లి పంచాయతీ పరిధిలో రూ.3.16 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు మోహిత్‌రెడ్డి తెలిపారు. గ్రామ సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, యోగా ధ్యాన మందిరం, జగనన్న సమావేశ మందిరంతో పాటు పలు పనులకు శ్రీకారం చుట్టినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లోకనాథం, జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, ఎంపీటీసీ కస్తూరి, సర్పంచ్ వసంత, పార్టీ కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, నాయకులు నంగా బాబురెడ్డి, నేంద్రగుంట, పాకాల, మొగరాల, దామలచెరువు డివిజన్ అధ్యక్షులు గుండ్లూరి సురేష్, నంగా కపిలేశ్వర్‌రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ మునీర్, మోహన్, డాక్టర్ శివప్రసాద్, నాగరాజు రాయల్, సద్దాం, చంటి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పంచాయతీ అధ్యక్షుల నియామకం



సుదర్శన్ రెడ్డి



రమేష్‌కిశోర్‌రెడ్డి



చంద్రశేఖర్ రెడ్డి



జయ



నారాయణరెడ్డి



రవి



హరినాథరెడ్డి



సుధీర్



లోకేష్

ఎర్రావారిపాళెం (భాకరాపేట): ఎర్రావారిపాళెం మండలంలోని పంచాయతీలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను నియమిస్తూ చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఉస్తికాయలపెంటకు నారాయణరెడ్డి, యల్లమందకు మదన్‌రెడ్డి, కొటకాడపల్లెకు రవిరెడ్డి, బోడేవాండ్లపల్లెకు రవి, వీఆర్ అగ్రహారానికి సుదర్శన్‌రెడ్డి, చింతగుంటకు లోకేష్, కమలయ్యగారిపల్లెకు జయ, నెర్బైలుకు హరి, ఉదయమాణిక్యంకు సుధీర్, చెరుకువారిపల్లెకు చిన్నమస్తాన్, ఎర్రావారిపాళెంకు రమేష్‌కిశోర్‌రెడ్డి (సన్నీ) నియమితులయ్యారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వారిని కోరారు.

అజయ్‌కుమార్‌పై టీడీపీ నేతల దాడి దుర్మార్గం



మాట్లాడుతున్న రాపూరి ప్రసాద్‌బాబు

తిరుపతి కల్చరల్: వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు అజయ్‌కుమార్‌పై టీడీపీ నేతలు దాడి చేయడం దుర్మార్గమని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రాపూరి ప్రసాద్‌బాబు, వైఎస్సార్ సీపీ సేవా దళ్ రీజనల్ కో ఆర్డినేటర్ తలారి రాజేంద్ర ధ్వజమెత్తారు. వారు సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. దళిత వర్గం కోసం నిరంతరం కృషి చేస్తున్న అజయ్‌కుమార్ రాజకీయ ఎదుగుదలను చూసి ఓర్వలేక టీడీపీ నేతలు దాడులకు పాల్పడ్డారన్నారు. అధికార దాహం కోసం టీడీపీ నేతలు ఎంతటికైనా వెనుకాడరని పేర్కొన్నారు. అలజడులు సృష్టించి దాడులకు పాల్పడడంతోపాటు ఎవరైతే ఎక్కువ కేసులు నమోదు చేసుకుంటారో వారికే నామినేటెడ్ పదవులు ఇస్తామని ఇటీవల నారా లోకేష్ చెప్పడం స్వార్థపు రాజకీయాలకు నిదర్శనమన్నారు. పోలీసులు స్పందించి దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బాబూ జగ్జీవన్‌రామ్ భవన్ గౌరవాధ్యక్షుడు మోహన్‌రాజ్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం నేతలు జీవన్, కుమార్, రాజేష్, అజయ్, ప్రభు, ఉదయ్‌కుమార్, భారతీయ దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగుల నిరసన

తిరుపతి అర్బన్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లాలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉద్యోగులు సోమవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. వారు దామినేడు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. సీఐటీయూ నేతలు మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులకు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. మంగళవారం సైతం నిరసన కార్యక్రమాన్ని కొనసాగిస్తామని వెల్లడించారు. సీఐటీయూ నేతలు కందారపు మురళి, బాల సుబ్రమణ్యం, ప్రసాద్‌రావు, లక్ష్మి పాల్గొన్నారు.

సచివాలయాల ఎనర్జీ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న పి.రాజు

తిరుపతి కల్చరల్: సచివాలయాల్లో పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని గ్రామ, వార్డు జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్–2 సెక్రటరీస్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి.రాజు కోరారు. ఆయన సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రజల వద్దకే పాలన అనే నినాదంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారని తెలిపారు. ఇందులో ఎనర్జీ అసిస్టెంట్‌లను నియమించారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 7 వేల మంది ఎనర్జీ అసిస్టెంట్లు పని చేస్తున్నారని పేర్కొన్నారు. ఎనర్జీ అసిస్టెంట్లుగా కాకుండా రాష్ట్ర డిస్కంలలో లేని క్యాడర్‌గా జేఎల్ఎం గ్రేడ్–2 పేరుతో 11 కేవీ, 33 కేవీలోని అధిక వోల్టేజ్ లైన్‌లలో పనులు చేస్తున్నామని తెలిపారు. ఇందులో పని చేస్తున్న వారు ఇప్పటికే ప్రమాదవశాత్తు రాష్ట్ర వ్యాప్తంగా 125 మంది చనిపోయారని వాపోయారు. మరో 250 మంది తీవ్ర గాయాలతో అంగవైకల్యం బారిన పడ్డారని తెలిపారు. మరణించిన వారి కుటుంబాలకు ఇప్పటి వరకు ఎలాంటి ఆదరణ లేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఎనర్జీ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నాయకులు మధు ఆచారి, యగ్నేష్, నరసింహారెడ్డి, శ్రీను, ప్రతాప్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో మామిడిలో అధిక దిగుబడి

రామచంద్రాపురం: మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని తిరుపతి జిల్లా వ్యవసాయ శాఖ జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య తెలిపారు. ఆయన సోమవారం నెత్తకుప్పంలో రైతులకు వ్యవసాయ, ఉద్యాన పంటలపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ మామిడి కాయలు కోసిన తరువాత 4 వారాలు చెట్లకు విశ్రాంతి ఇచ్చి గాలి, వెలుతురు బాగా సోకే విధంగా కత్తిరింపులు చేయాలని సూచించారు. కత్తిరించిన భాగాలకు 3 గ్రాముల బ్లైటాక్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. చెట్టు చుట్టూ 6 అడుగుల వరకు గాడి తీసి 1.5 కిలోల యూరియా, 3 కిలోల సూపర్ పాస్ఫేట్, ఒక కిలో పొటాష్ వేసి నీరు పెట్టాలని చెప్పారు. ఏఓ వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ వరి సాగులో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో పట్టు పరిశ్రమ అధికారి భారతి, గ్రామ వ్యవసాయ సహాయకులు భరత్, వలంటీర్లు భాను, సౌందర్య, తేజ పాల్గొన్నారు.

పవన్‌కళ్యాణ్ నోరు అదుపులో పెట్టుకో



నిరసన తెలుపుతున్న జేసీఎస్ నాయకులు

తిరుపతి మంగళం: జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడితే బాగుంటుందని వైఎస్సార్‌సీపీ జేసీఎస్ తిరుపతి అధ్యక్షుడు బాలిశెట్టి కిషోర్ హెచ్చరించారు. వలంటీర్లపై పవన్‌కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ సోమవారం 36వ డివిజన్‌లో నిరసన తెలిపారు. పవన్‌కళ్యాణ్ బ్యానర్లను దహనం చేశారు. బాలిశెట్టి కిషోర్ మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా ఉంటూ ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందజేస్తున్న వలంటీర్లను అమ్మాయిలను చెరబట్టే ముఠాగా దూషించడం పవన్‌కళ్యాణ్ నీచ మనస్తత్వానికి నిదర్శనమన్నారు. పెళ్లిళ్ల పేరుతో మహిళలను మోసం చేస్తున్నది పవన్‌కళ్యాణ్ అని మండిపడ్డారు. వలంటీర్ల సేవలను ప్రజలు మెచ్చుకుంటున్నారని వివరించారు. నిజానిజాలు తెలుసుకోకుండా ఏది పడితే అది వాగితే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్య క్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ నైనారు మధు బాల, జేసీఎస్ అధ్యక్షులు ఉదయగిరి రమేష్, మద్దాలి శేఖర్, దొడ్డారెడ్డి మురళీరెడ్డి, కార్పొరేటర్ కుడితి సుబ్రమణ్యం, వార్డు అధ్యక్షులు ఎన్వీ సురేష్‌రాయల్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీధర్, అరుణ, విజయలక్ష్మి, కోటారి సుభాష్, భాస్కర్, సూరి, కిరణ్ పాల్గొన్నారు.

సంతలో ప్రజలకు అన్నదానం



పాకాల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నిర్వహిస్తున్న సంతలో రైతులు, వ్యాపారులు, గ్రామాల నుంచి వచ్చే ప్రజలకు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సొంత నిధులతో భోజనాలు పెట్టారు. పాకాలతో పాటు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో జరిగే వారపు సంతల్లో భోజనాలను సరఫరా చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నేతలు తెలిపారు.

పరిశోధనలతో సమస్యలకు పరిష్కారం



పరిశోధక విద్యార్థినులతో వీసీ తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్: సమాజంలోని క్లిష్టమైన సమస్యలకు పరిశోధనలతోనే పరిష్కారం లభిస్తుందని పద్మావతి మహిళా వర్సిటీ వీసీ డి.భారతి తెలిపారు. వర్సిటీలో ఏడు రోజులుగా హైదరాబాదుకు చెందిన ఐసీఎస్ఎస్ఆర్ రీజనల్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన రీసెర్చ్ మెథడాలజీ వర్క్‌షాప్ సోమవారం ముగిసింది. వీసీ మాట్లాడుతూ అన్ని సమస్యలకు పరిష్కారం ఉంటుందన్నారు. దాని కోసం సమయం కేటాయించి ఆలోచనలకు పదును పెట్టాలని తెలిపారు. విద్యార్థులు పరిశోధనల వైపు దృష్టి సారించాలని సూచించారు. ఐసీఎస్ఎస్ఆర్ కన్సల్టెంట్ జాకబ్ మాట్లాడుతూ రీసెర్చ్‌లో ఎథిక్స్ ఎంతో ముఖ్యమని తెలిపారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ విజయలక్ష్మి, ఉమ, అనూరాధ, ఇందిర, మాధవి, నీరజ, శ్రీరజిని, రూప, లత, వజీహ పాల్గొన్నారు.

అవగాహన లేకుండా మాట్లాడడం పద్ధతి కాదు



మంత్రి మేరుగు నాగార్జున

తిరుమల: వలంటీర్ వ్యవస్థ ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా ఇంటింటికీ అందిస్తోందని, అలాంటి వ్యవస్థపై అవగాహన లేకుండా ఆరోపణలు చేయడం సరైన పద్ధతి కాదని రాష్ట్ర మంత్రి మేరుగు నాగార్జున పేర్కొన్నారు. ఆయన సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం వెలుపల ఆయన మాట్లాడుతూ నిరంతరం పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి రావాలని స్వామివారిని ప్రార్థించానన్నారు. ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న వలంటీర్లపై అవగాహన లేని వారు మాట్లాడడం పద్ధతి కాదన్నారు.

పేద విద్యార్థులకు లయన్స్ క్లబ్ నగదు బహుమతి



విద్యార్థులను సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు, కార్పొరేటర్ అనీష్ రాయల్

తిరుపతి కల్చరల్: పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన పేద విద్యార్థులకు లయన్స్ క్లబ్ ప్రతినిధులు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. తుంబువానిగుంట మున్సిపల్ స్కూల్‌లో సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ అనీష్ రాయల్ ముఖ్య అతిథిగా విచ్చేసి 20 మంది విద్యార్థులకు నగదు, జ్ఞాపికలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి సెవెన్ హిల్స్ అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్, కార్యదర్శి జగన్నాథం, కోశాధికారి బెల్లం కొండ సురేష్, రఘు, రామారావు, స్కూల్ చైర్మన్ రాజేంద్ర, లక్ష్మయ్య పాల్గొన్నారు.

టీటీడీ సహకారంతో రోడ్ల సేఫ్టీకి చర్యలు

తిరుపతి తుడా: టీటీడీ సహకారంతో తిరుపతి నగరంలోని రోడ్ల సేఫ్టీకి చర్యలు తీసుకుంటామని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత తెలిపారు. ఆమె సోమవారం రోడ్ల నిర్వహణపై ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ నగరంలోని తొమ్మిది రోడ్లు టీటీడీ పరిధిలో ఉన్నాయన్నారు. వాటిలో సేఫ్టీ విషయమై టీటీడీ ఇంజినీర్లతో కలిసి చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. శ్రీనివాస సేతు, శ్రీనివాసం వద్ద దిగే వాహనాలు వేగంగా వస్తుండడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. అదే ప్రాంతంలో శ్రీనివాసం మాధవం అతిథి గృహాల్లోకి ఎంట్రీ ఉండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందన్నారు. టీటీడీ అధికారులతో సమన్వయం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జగనన్న సురక్షలో సర్టిఫికెట్స్ తీసుకునే ప్రజలకు ముందుగానే సమాచారం ఇచ్చి వారిని క్యాంపులకు హాజరయ్యేలా చూడాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించవద్దని ఆదేశించారు. నగరంలో అనధికారిక హోర్డింగులు తొలగించాలని, ఆక్రమిత స్థలాలపై దృష్టి సారించాలన్నారు. అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఎస్ఈ మోహన్, ఎంఈలు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, హెల్త్ ఆఫీసర్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక సౌకర్యాలతో ఎంపీడీవో కార్యాలయ భవన నిర్మాణం



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి, ఎంపీడీవో రమేష్‌బాబు

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరిలో మండల పరిషత్ కార్యాలయాన్ని అత్యాధునిక హంగులతో నిర్మిస్తామని ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం పాత ఎంపీడీవో కార్యాలయ స్థలాన్ని ఎంపీడీవో రమేష్ బాబుతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎంపీడీవో కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో తొలగించామన్నారు. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సహకారంతో రూ.కోటిన్నర నిధులతో నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. త్వరలోనే పనులకు భూమి పూజ చేపడతామని వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు మాధవరెడ్డి, రాజయ్య, సర్పంచ్ రూప, పంచాయతీ కార్యదర్శి మహేశ్వరయ్య పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పరిపాలన



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష

- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి
- 6వ డివిజన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం

తిరుపతి మంగళం: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పేర్కొన్నారు. ఆయన సోమవారం మేయర్ శిరీష, కార్పొరేటర్ కేతం జానకి, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు నాదమునిరెడ్డి, బాలాజీతో కలిసి 6వ డివిజన్ చంద్రశేఖర్‌రెడ్డి కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జగనన్న మీ కుటుంబానికి మేలు చేసి ఉంటే వచ్చే ఎన్నికల్లో మద్దతు ఇచ్చి ఓట్లు వేయాలని స్థానికులను కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశానికే ఆదర్శంగా జగనన్న పరిపాలన సాగిస్తున్నారని తెలిపారు. ఇన్ని సంక్షేమ పథకాలు అందించడం జగనన్నకే సాధ్యమైయిందని చెప్పారు. ప్రజలంతా ఎంతో సంతృప్తిగా ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో జగనన్నకు మద్దతుగా ఉంటామని చెబుతున్నారని పేర్కొన్నారు. జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతిగడపకూ రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు లబ్ధి కలిగినట్లు వివరించారు. ఈ క్రమంలో తాము ఏ గడపకు వెళ్లినా హారతులతో ఘనంగా స్వాగతం పలుకుతున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో టౌన్ బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నైనారు మధుబాల, 7వ డివిజన్ అధ్యక్షుడు చిమట రమేష్, డైరెక్టర్లు వేమూరి జ్యోతిప్రకాష్, ఖాశీం, కడపగుంట అమరనాథ్‌రెడ్డి, నాయకులు పాముల రమేష్‌రెడ్డి, చిన్నముని, నైనారు శ్రీనివాసులు, వాటర్‌ప్లాంట్ రవి, ఎస్వీ సురేష్, నాదముని పాల్గొన్నారు.

12 నుంచి బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ

తిరుపతి రూరల్(చంద్రగిరి): గ్రామీణ మహిళలకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో ఈ నెల 12 నుంచి నెల రోజులు బ్యూటీషియన్ కోర్సులో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు యూనియన్ బ్యాంకు గ్రామీణ ఉపాధి సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు తెలిపారు. సోమ వారం ఆయన మాట్లాడుతూ పదోతరగతి ఉత్తీర్ణులై, తెల్లరేషన్ కార్డు ఉన్న 19 నుంచి 45 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. ఎంపికైన వారికి భోజన వసతి కల్పిస్తున్నామని, బస్సు చార్జీలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ట్రెనింగ్ పూర్తయిన తర్వాత సర్టిఫికెట్ అందజేయనున్నట్లు వివరించారు. ఆసక్తిగల వారు పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణాభివృద్ధి సంస్థ, ద్వారకా నగర్, కొత్తపేట, చంద్రగిరి. 79896 80587, 94949 51289 నంబర్లలో సంప్రదించాలని కోరారు.